## 11అక్టోబర్, 2021న అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా

# “ఆడపిల్లను పుట్టనిద్దాం... బతకనిద్దాం... చదవనిద్దాం... ఎదగనిద్దాం!”

## అని ఎలుగెత్తి చాటుదాం!!

Digital Generation our Generation



DBRC
Dalit Bahujan Resource Centre



**ఒక సమాజ అభివృద్ధిని
ఆ సమాజంలోని
స్త్రీల అభివృద్ధితోనే లెక్కిస్తాను.**

**- డా॥ బి.ఆర్. అంబేద్కర్**

**ఆడపిల్ల అంటే ఆటబొమ్మ కాదు. అద్వితీయ శక్తి అన్నాడో కవి. నేడు మన సమాజంలో బాలలతో పాటు బాలికలకూ సమానత్వం ఉందా అంటే భిన్న వాదనలు ఎదురవుతాయి. ఉనికిని గుర్తింపుగా మార్చుకోవాలని, అభివృద్ధిలో తన మేధస్సుకు, శ్రమకు చోటు దక్కాలని, అవకాశాలను ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉండాలని, నిర్ణయాలు తీసుకునే స్వాతంత్ర్యం కావాలని, బాలలతో పాటు బాలికలూ కలలు కంటారు. కానీ ఆ కలలు శతాబ్దాలుగా కలలుగానే మిగిలిపోతున్నాయి.**

బాలికల కలలు నిజం చేయడానికి, వారి హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు ప్రశ్నించడానికి, నేటి సమాజంలో వారు ఎదుర్కొంటున్న సవాళ్ళని ప్రపంచానికి తెలియజేయడానికి, బాలబాలలికల సమానత్వంపై యూవత్ మానవాళికి అవగాహన పెంచే ఉద్దేశంతో ప్రతీ ఏడాది అక్టోబర్ 11వ తేదీన ఐక్యరాజ్యసమితి **“అంతర్జాతీయ బాలికల దినోత్సవం”**ను నిర్వహిస్తోంది.

1995లలో బీజింగ్‌లో నిర్వహించిన భేటీలో మహిళలు, బాలికల హక్కుల కోసం ప్రపంచ దేశాలు ఏకగ్రీవ తీర్మానం చేశాయి. బాలికల హక్కుల కోసం ఆమోదం పొందిన తొలి తీర్మానం ఇదే. బాలికల హక్కులను కాపాడేందుకు, ఆడపిల్లలుగా వారు స్వావలంబన దిశగా పయనించేందుకు ఐక్యరాజ్యసమితి 2011, డిసెంబర్‌లో అక్టోబర్ 11ను అంతర్జాతీయ బాలికల దినోత్సవంగా ప్రకటించింది. ఇక అది మొదలు 2012 నుంచి ప్రతి ఏడాది ఒక్కో నూతన అంశంతో, నినాదంతో, సరికొత్త కార్యాచరణతో ప్రపంచ దేశాలకు దిశానిర్దేశం చేస్తూ బాలికల దినోత్సవాన్ని ఐరాస నిర్వహిస్తోంది.

పురుషాధిపత్యం, అసమానత, చిన్నచూపు, వివక్ష, వేధింపులు, లైంగిక హింస.. వంటి పలు సమస్యలు పుట్టినప్పుటి నుంచి కౌమార దశ వరకు ప్రతి ఆడపిల్ల ఎదుర్కొంటుందన్న మాట వాస్తవం. అన్నింట్లోను, అందరికంటే స్త్రీ ఎల్లవేళలా తక్కువే అనే పురుషుడి భావనే ఈ దుష్భావనలకు మూలం. ఆడపిల్ల ఎప్పటికైనా తమను విడిచి అత్తవారింటికి వెళ్లిపోవాల్సిందేగా.. అని ఆలోచించే తల్లిదండ్రుల మనస్తత్వం వారికి తమ కుమార్తె పైనున్న ప్రేమను, అభిమానాన్ని దూరం చేస్తే..త్వరత్వరగా పెళ్లి చేసేసి ఒక బరువును దించుకోవాలనుకునే తల్లిదండ్రుల ఆలోచన వల్ల అటు ఆ ఆడపిల్ల తన కలలకు, ఆకాంక్షలకు దూరమవుతోంది.

అయితే గతంతో పోల్చిచూస్తే..మార్పు నేడు అనివార్యమైంది. ప్రజల్లో కూడా చైతన్యం వస్తోంది. బాలికలకు కూడా ఉన్నత చదువులు చెప్పించడంలో అనేకమంది తల్లిదండ్రులు తమదైన పాత్ర పోషిస్తున్నారు. అయితే సమానత్వం, స్వేచ్ఛ, నిర్ణయాధికారం వంటి విషయాల్లో మాత్రం తమ కుమారులతో పోల్చి చూస్తే..కుమార్తెలకు ఎంత స్వాతంత్ర్యం ఇస్తున్నారనేది ప్రశ్నే. ఇక కౌమార దశలో బాలికల భద్రత మీద కూడా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రపంచీకరణలో పెరుగుతున్న సాంకేతికత యువత మీద చాలా ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా యువత, సినిమాల ప్రభావంతో తమ ఈడు ఆడపిల్లలను అధములు, ఒక వస్తువుగా, చులకనగా

చూస్తూ..వేధిస్తూ.. ఆడపిల్లల మానసిక, శారీరక హింసకు కారణం అవుతున్నారు. సినిమాల్లో చూపించినట్లు ఆడపిల్లల దగ్గర హీరోయిజం చూపించాలని, తాము కూడా ప్రేమలో పడాలని భావించడమే కాక తమ ప్రేమను అంగీకరించని బాలికలపై అఘాయిత్యాలకూ, యాసిడ్ దాడులకూ పాల్పడుతున్నారు.

భారతదేశ పరిస్థితికి వస్తే, ప్రపంచంలో మహిళలు అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉన్న దేశాల్లో భారతదేశం మొదటి స్థానంలో ఉందని థామ్సన్ రాయిటర్స్ ఫౌండేషన్ ప్రకటించింది. 2011లో నిర్వహించిన ఇదే సర్వేలో భారతదేశం నాలుగో స్థానంలో ఉండగా, 2018లో ప్రథమ స్థానంలోకి వచ్చిందని సంస్థ వెల్లడించింది. మహిళలకు సంబంధించి మొత్తం ఆరు అంశాలకు సంబంధించి ఆయా దేశాల్లో నెలకొన్న ప్రమాదకర పరిస్థితిని బట్టి ర్యాంకులు ఇవ్వాలని సర్వేలో పాల్గొన్న వారిని కోరింది.

**అవి:**

1. లైంగిక హింస
2. సంస్కృతీ సంప్రదాయాలు
3. మహిళల అక్రమ రవాణా
4. లైంగికేతర హింస
5. వివక్ష
6. ఆరోగ్య పరిరక్షణ

**జాతీయ నేర పరిశోధన సంస్థ 2019 నివేదిక ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో...**

**మహిళలపై జరిగిన నేరాలు:**

- లైంగిక వేధింపుల కేసుల్లో మన రాష్ట్రం 8వ స్థానంలో ఉంది.
- 4444 లైంగిక వేధింపుల కేసులు నమోదయ్యాయి.
- 17746 మహిళలపై వివిధ నేరాలపై నమోదు అయిన కేసులు
- 2018 తో పోల్చినే 2019కి అత్యాచార కేసులు పెరిగాయి. (1086 నుండి 1104)

**ఎస్సీ/ఎస్టీ లపై జరిగిన నేరాలు:**

- దక్షిణ భారతదేశంలో అత్యధికంగా 2071 కేసులు నమోదు కాగా అందులో 50 శాతం పైగా మైనర్ బాలికలపై జరిగినవే.

**పిల్లలపై నేరాలు:**

- మన రాష్ట్రంలో 502 లైంగిక నేరాల కేసులు నమోదు అయ్యాయి.
- ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన నేరాల్లో 50% మైనర్ బాలికలపై జరిగాయి.

దేశంలో 23 శాతం మంది బాలికలు స్కూల్ డ్రాపౌట్స్‌కు కారణం రుతుక్రమ సమయంలో పాఠశాలల్లో వారికి ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రత్యేక మరుగుదొడ్లు లేకపోవడం వంటి సమస్యలను అధిగమించడానికి రాష్ట్ర ప్రభుత్వం మన బడి, నాడు-నేడు పేరుతో పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, ప్రభుత్వ పాఠశాలల్లో మరియు కళాశాలల్లో 7వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న బాలికలకు **"స్వేచ్ఛ"** కార్యక్రమం క్రింద శానిటరీ నాప్‌కిన్లు అందజేస్తున్నది. బాలికలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టడానికి 'దిశ' యాప్‌ను ప్రవేశపెట్టింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పెద్దఎత్తున నిధులు ఖర్చుచేసి బాలికల విద్య, అభివృద్ధి మరియు సాధికారత కొరకు ఎన్నో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినా కూడా సమాజంలో ఇంకా రావలసినంత మార్పు రావడం లేదు. ఆడ, మగ నిష్పత్తిలో, అక్షరాస్యత, విద్యలో, పౌష్టికాహారం, ఆరోగ్యం విషయంలో, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో అసమానతలు, లైంగిక అణచివేత, గృహ హింస కొనసాగుతూనే ఉన్నాయి.

**రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం:** 2021 నివేదిక ప్రకారం కోవిడ్ కారణంగా భారతదేశంలో 1 కోటి మంది బాలికలు ప్రాథమిక పాఠశాలను మానేయవచ్చు. విద్యాహక్కు ఫోరమ్ నివేదిక లెక్కల ప్రకారం 11 నుండి 14 సంవత్సరాల వయస్సు గల 16 లక్షల మంది బాలికలు ప్రస్తుతం పాఠశాలలకు దూరంగా ఉన్నారు. ఈ కోవిడ్ మహమ్మారి ఈ బాలికలనందరినీ బాల్య వివాహాలు, పేదరికం, అక్రమ రవాణా, హింసకు గురి చేసేలా ఉంది.

పాఠశాలల్లో దళితుల, గిరిజనుల మరియు ముస్లిం వర్గాల బాలికల నమోదు గణనీయంగా తగ్గింది.

| | ప్రైమరీ | సెకండరీ | హైయ్యర్ |
|---|---|---|---|
| ఎస్సీ | 19.34 | 18.6 | 17.3 |
| ఎస్టీ | 10.35 | 8.6 | 6.8 |

అమ్మాయిలు ఆకాశంలో సగమని చాటడానికి, అవకాశాలను అందిపుచ్చుకోవడానికి సమాజం లోని ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాల్సిన అవసరం ఉంది. ఆడ పిల్లల పట్ల వివక్షకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ కృషి చేసినప్పుడే..ఆడా మగ మధ్య వ్యత్యాసాలు తొలగిపోతాయి. అప్పుడే ఈ భువికి నిజమైన వెలుగు. ఈ నాగరికతకు సరైన అర్థం.

**"స్త్రీ లేకపోతే గమనం లేదు. స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదు. స్త్రీ లేకపోతే అసలు సృష్టే లేదు. ఆడపిల్లను రక్షించుకుందాం.. సృష్టిని కాపాడుకుందాం"**

**ఈ నేపథ్యంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బాలికల విద్య, ఆరోగ్యం, అభివృద్ధి, సాధికారత తదితర అంశాల పట్ల మన ఆలోచనల్లో, దృక్పథాల్లో, ప్రాధాన్యతల్లో మార్పుకోసం కోసం ఆక్టోబర్ 7 నుండి 12 వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా సమాజ చైతన్య ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాలు, స్వచ్ఛందసేవా సంస్థలు, పేరెంట్స్ కమిటీలు భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసినదిగా కోరుతున్నాము.**


## దళిత బహుజన రిసోర్స్ సెంటర్, ఆంధ్రప్రదేశ్

డోర్.నం. 4-16-25/6, బండ్లమూడి కాంప్లెక్స్, భారత్‌పేట, అమరావతి రోడ్, గుంటూరు. ఫోన్: 0863-2254271

e-mail: apdbrc@gmail.com web: www.dbrcindia.org